
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.3 । కనిష్ఠం 20.7
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
3
బుధవారం 6 నవంబరు 2024





ప్రభుత్వం రూపొందించిన సర్వే వివరాలతో కూడిన ఫారం



● ఇంటింటా సర్వే స్టిక్కర్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

సమగ్ర సర్వేకు.. సర్వం సిద్ధం

- జిల్లాలో నేటి నుంచి ఇంటింటా కుటుంబ సర్వే ప్రారంభం
- లక్షా 97వేల 559 కుటుంబాల సర్వేకు ఏర్పాట్లు పూర్తి
- మొత్తం 1,997 మంది ఎన్యుమరేటర్ల నియామకం
- సర్వే విధులకు హాజరుకు ఆసక్తి చూపని సిబ్బంది
- పకడ్బందీగా సర్వేను చేపట్టేందుకు శిక్షణ పూర్తి





ఆదిలాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టేందుకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. నవంబరు 6 నుంచి ---- వరకు సర్వేను పూర్తి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సర్వే సిబ్బందికి మండలాలు, మున్సిపల్ పరిధిలో అవగాహన, శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేశారు. బుధవారం 9గంటల నుంచి ఇంటింటా కుటుంబ సర్వేను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రారంభించనున్నారు. జిల్లాలో 18 మండలాల పరిధిలో 473 గ్రామ పంచాయతీలు ఉండగా మున్సిపల్ పరిధిలో 49 వార్డులు ఉన్నాయి. ఇంటింటా సమగ్ర సర్వేను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన నమునాలో సర్వే వివరాలను చేపట్టి నమోదు చేయనున్నారు. ముఖ్యంగా జిల్లా పేరు, మండలం పేరు, గ్రామ పంచాయతీ, వార్డు, నివాసంతో పాటు జిల్లా కోడ్, మండల కోడ్, ఈబీ నెంబరు, ఇంటి నెంబరు, కుటుంబ యజమాని పేరును తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే సమగ్ర కుటుంబ సర్వే విధులకు హాజరయ్యేందుకు కొంత మంది సిబ్బంది వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే తలమడుగు మండలంతో పాటు పలు మండలాల్లో ఉపాధ్యాయులతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది నిరసన వ్యక్తం చేసిన దాఖలాలు ఉన్నాయి. ఎందుకంటే క్షేత్ర స్థాయిలో ఇంటి యజమానులు సహకరించకుంటే సర్వే ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో 1,97,559 కుటుంబాలు

జిల్లాలో లక్షా 97వేల 559 కుటుంబాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో లక్షా 49వేల 161 కుటుంబాలు కాగా మున్సిపల్ పరిధిలో 48వేల 398 కుటుంబాలు ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ఒక్కో ఎన్యూమరేటర్ గరిష్ఠంగా 170 కుటుంబాలను సర్వే చేసే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే వార్డులు, గ్రామాల వారీగా ఎన్యూమరేటర్లను కేటాయించి విధులను అప్పగించారు. అయితే పార్ట్-1 విభాగంలో కుటుంబ యజమాని, కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలను నమోదు చేయాల్సి ఉండగా పార్ట్-2లో స్థిర, చర ఆస్తుల వివరాలు, రేషన్‌కార్డు, నివాస గృహం విస్తీర్ణం, ఆస్తుల వివరాలు, తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే స్థానికంగా అందుబాటులో లేని ఇంటి యజమాని వివరాలను నమోదు చేయడం కొంత ఇబ్బందికరంగా మారుతుందన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. సకాలంలో కుటుంబ సర్వేను పూర్తి చేయడానికి కుటుంబ యజమాని సహకారం తప్పనిసరిగా మారిందంటున్నారు.

రెండు విడతల్లో సర్వే

సమగ్ర కుటుంబ సర్వేను రెండు విడతల్లో చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఔట్ సోర్సింగ్ టీచర్లు, గెస్ట్ లెక్చరర్లు, మున్సిపల్, పంచాయతీ, ఇతర సిబ్బంది ఉదయం 9గంటల నుంచి సర్వేను ప్రారంభిస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం 1గంట తర్వాత ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమగ్ర సర్వేలో పాల్గొంటారు. ఇలా రెండు విడతల్లో సర్వేను పూర్తి చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా సర్వేను నిర్వహించడానికి 1,997 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 1,490 మంది ఎన్యుమరేటర్లు విధులు నిర్వహించగా మరో 122 మంది అదనంగా నియమించారు. అలాగే ప్రతీ మూడు గ్రామ పంచాయతీలకు ఒక సూపర్‌వైజర్ చొప్పున.. మొత్తం 173 మంది సూపర్‌వైజర్లు సర్వేను పర్యవేక్షించనున్నారు. అలాగే మున్సిపల్ పరిధిలో 385 ఎన్యూమరేటర్లు కాగా, 41 మంది సూపర్‌వైజర్లు విధులు నిర్వహిస్తారు. గ్రామాలు, వార్డుల వారీగా బ్లాకులు విభజించి సర్వే బాధ్యతలను అప్పగించారు. మొత్తం 72 వివరాలతో కూడిన సర్వేను చేపట్టనున్నారు.

బలవంతంగానే విధులకు..

సమగ్ర సర్వేను చేపట్టేందుకు సిబ్బంది ఊగిసలాటలో కనిపిస్తున్నారు. ఇప్పటికే కొందరు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, గెస్ట్ లెక్చరర్లు, సర్వే విధుల నుంచి తప్పించాలని అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. దీంతో మంగళవారం సాయంత్రం వరకు సిబ్బంది కోసం అధికారులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఎదురయ్యింది. రోజుకు

(మిగతా 4వ పేజీలో...)



తాంసిలో క్షుద్ర పూజల కలకలం

- గ్రామ ప్రధాన రహదారిపై నిమ్మకాయ, పసుపు కుంకుమ
- స్థానికుల భయాందోళన
- సరిగ్గా నెల క్రితం ఇలాంటి ఘటనే..



4

ప్రారంభమైన రాష్ట్రస్థాయి క్రీడలు

- ఉట్నూర్‌కు తరలివచ్చిన గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు
- క్రీడాజ్యోతిని వెలిగించిన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఐటీడీఏ పీవో



5

కనుమరుగవుతున్న పల్లె రథం

- ఆధునిక యంత్రాల వినియోగంతో పల్లెల్లో కనిపించని ఎడ్లబండ్లు
- సౌలభ్యంగా ఉండడంతో ట్రాక్టర్ల వైపు రైతన్నల చూపు



5



మాట్లాడుతున్న డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి

ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలను వినియోగించొద్దు : డీఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హోటళ్లు, రెస్టారెంట్లు ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలను వినియోగించరాదని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన నిర్మల్ పట్టణంలోని గ్రిల్ నైన్ హోటల్‌లో ఆహారాన్ని తిని బోథ్ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఐదుగురు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఆ పాఠశాలలో కుక్(మహిళ) ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందిందన్నారు. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు గ్రిల్ నైన్ యాజమాన్యం, సిబ్బందిపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఎలాంటి వస్తువులను, కుళ్లిన పదార్థాలను, వంటకాలను ఫ్రిడ్జ్‌లలో నిల్వ చేస్తూ వినియోగించరాదని తెలిపారు. ఇందులో ఒకటో పట్టణ సీఐ సునీల్, రెండో పట్టణ సీఐ కరుణాకర్, ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొనారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి : హెచ్‌ఈవో

నేరడిగొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని హెచ్‌ఈఓ పవార్ రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని గాజిలి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య చికిత్సలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఈవో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. మురికి కాల్వల్లో ఉన్న చెత్తా చెదారాన్ని కార్మికుల ద్వారా తొలగింప చేయాలన్నారు. తాగునీటిని వేడి చేసిన అనంతరం చల్లార్చి తీసుకోవాలని, అలాగే వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంతోష్ హెచ్‌ఏ సాయన్న, ఆశా ఏఎన్‌ఎం, తదితరులున్నారు.

● ప్రభుత్వ ఆసుపత్రులలోనే మెరుగైన వైద్యం

నేరడిగొండ(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులలోనే మెరుగైన వైద్యం అందిస్తున్నామని వైద్యాధికారి ఎండీ సద్దాం అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎం ఆశా,ఎంఎల్ హెచ్‌పీలతో పాటు సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులలో అందిస్తున్న వైద్యంపై అవగాహన కల్పించాలన్నారు. గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు జరుపుకునేలా చూడాలన్నారు. ఇందులో హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ సూపర్ వైజర్ సంతోష్, హెచ్‌వీ స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పొరపాట్లు లేకుండా నిర్వహించాలి

● గూగుల్ మీట్‌లో కలెక్టర్ రాజర్షిషా అధికారులతో సమీక్ష

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా 473 గ్రామ పంచాయతీల పరిధిలో 1,49,161 ఇండ్లలో 1612 ఎన్యుమరేటర్లు, 173 సూపర్‌వైజర్లు సర్వే నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 48,393 ఇండ్లలో 385 ఎన్యుమరేటర్లు, 41 సూపర్‌వైజర్లు సర్వే నిర్వహించనున్నారని తెలిపారు. సర్వేపై గూగుల్ మీట్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సర్వే ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

● కారుణ్య నియామక పత్రాలు అందజేత

కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలదేవితో కలిసి మంగళవారం కారుణ్య నియామక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ మేరకు ప్రభుత్వ ఉద్యోగి విధి నిర్వహణలో మరణించిన కుటుంబ వారసులకు కారుణ్య నియామకంలో భాగంగా 19 మందికి ఉద్యోగం కల్పించారు. ఇందులో 8 మందికి జూనియర్ అసిస్టెంట్, 10 మందికి ఆఫీస్ సబార్డినేట్, ఒక్కరికి వాచ్‌మెన్ నియామక పత్రాలను జిల్లా కలెక్టర్ సంబంధిత సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో కారుణ్య నియామక అభ్యర్థులు పాల్గొన్నారు.



గూగుల్ మీట్‌లో అధికారులతో మాట్లాడుతూ..

ప్రాణాలను బలిగొన్న కలుషిత ఆహారం!

● పొట్టకూటి కోసం వచ్చి.. విగత జీవిగా మారిన యువతి

బోథ్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్రంలో పుట్టి పెరిగిన పుల్‌కొలి బైగా (19) గతేడాది పొట్ట చేత పట్టుకొని బోథ్ మండలంలోని సెయింట్ థామస్ పాఠశాలలో వంట మనిషిగా చేరింది. అనుకోని విధంగా పాఠశాల ఉపాధ్యాయులతో పాటు కలిసి ఈనెల 2వ తేదిన నిర్మల్ పట్టణానికి షాపింగ్ నిమిత్తం వెళ్లింది. అయితే షాపింగ్ రాత్రి కావడంతో ఆకలి తీర్చుకునేందుకు హోటల్ గ్రీన్ నైన్ మల్టీ కుషన్ రెస్టారెంట్‌కు వెళ్లింది. అందరితో కలిసి భోజనం చేసిన ఈమెను ఆకలి తీర్చిన అన్నమే ప్రాణం తీస్తుందని ఊహించలేదు. భోజనం చేసిన రాత్రి నుంచి తీవ్రమైన కడుపు నొప్పితో పాటు వాంతులు, విరోచనాలు కావడంతో బోథ్‌లోని ఆసుపత్రిలో చికిత్స తీసుకుంది. కడుపునొప్పి వాంతులు కొంత తగ్గుముఖం పట్టడంతో ఇంటికి చేరుకున్నారు. ఆ తర్వాత 3వ తేదీన వైద్యం తీసుకోగా.. వాంతులు విరోచనాలు తగ్గినట్టే తగ్గి ఎక్కువ కావడంతో 4వ తేదీన ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది.



● బోథ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయులు

● విగత జీవిగా....

నిరుపేద కుటుంబానికి చెందిన మృతురాలు పుల్‌కొలి బైగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలో నుంచి ఉపాధి కోసం ఇక్కడికి రావడం జరిగింది. అందరితో కలుపుగోలుగా ఉంటూ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులకు వంట పనులు చేసేది. అయితే తిన్న ఆహారమే ఆమెకు ప్రాణ సంకటంగా మారడంతో పాఠశాల సిబ్బందిలో విషాదం అలుముకుంది. మృతి చెందిన యువతి సమాచారాన్ని వారి తల్లిదండ్రులకు అందించారు. దీంతో శవాన్నీ తీసుకు వెళ్లేందుకు మధ్యప్రదేశ్ నుంచి మంగళవారం మధ్యాహ్నం వెళ్లారని పాఠశాల యజమాన్యం పేర్కొంది.

● హోటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

యువతి మరణానికి కారణమైన నిర్మల్‌లోని హోటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంద ని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అందమైన బోర్డులు.. రంగురంగులా విద్యుత్ బల్బులతో ఏర్పాటైన హోటళ్లు నాణ్యత లేని భోజనంతో ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయి. ప్రతీ రోజు బోథ్ మండలం నుం చి వందల సంఖ్యలో వివిధ పనుల నిమిత్తం నిర్మల్‌కు వెళుతుంటారు. అయితే అక్కడి హోటళ్లపై నమ్మకంతో భోజనాలు చేసి వ్యాధులు బారిన పడుతున్నారు.

● మరో నలుగురికి మెరుగైన వైద్యం కోసం..

ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురైన మరో నలుగురు ఉపాధ్యాయులను మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించనున్నారు. బోథ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నలుగురు ఉపాధ్యాయులను మంగళవారం సాయంత్రం రిమ్స్ ఆసుపత్రికి తరలించాలనే ఏర్పాట్లలో అధికారులు ఉన్నారు.



తలమడుగులో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్

రబీలో ఎరువుల కొరత లేకుండా చూడాలి

తలమడుగు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ పంట సాగు చేసే రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి శ్రీధర్ మాట్లాడుతూ మాట్లాడుతూ నీటి సవతి కలిగిన, రైతులు రబీ పంటలు సాగు చేస్తున్నారని వారికి ఎలాంటి ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా పంటల సాగు చేసే రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఎరువులు కొనుగోలు చేసే రైతులు ఆధార్ నెంబర్‌ను ఆన్‌లైన్ ఎప్పటికప్పుడు పొందుపరచాలని సూచించారు. అలాగే దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రషీదులు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం సంఘానికి సంబంధించిన రిజిష్టర్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో మోతే శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి, సిబ్బంది రమాకాంత్, బబ్లూ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

ఉట్నూర్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీయూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో రూమ్ టూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం కోసం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా రాష్ట్రంలోని పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దుతఉన్నామని తెలిపారు. తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని సూచించారు. పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆశన్న, ప్రధాన ఉపాధ్యాయులు నీలిమ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



నిమ్మకాయ, కుంకుమ, గుడ్డు ఉన్న దృశ్యం

తాంసిలో క్షుద్ర పూజల కలకలం

తాంసి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఒక కాలనీలో గల ప్రధాన రహదారిపై క్షుద్ర పూజలు అనవాళ్లు కలకలం రేపుతున్నాయి. రహదారి మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి గుడ్డ, నిమ్మకాయ, కుంకుమ, పసుపు ఉంచారు. ఇదిలా ఉండగా నెల రోజుల క్రితం ఇదే గ్రామంలోని ఆశ్రమ పాఠశాల ఎదుట ఇలాంటి అనవాళ్లే కనిపించాయి. దీంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు.

అక్రమ కలప పట్టివేత



పట్టుకున్న కలప దుంగలతో అటవీశాఖ అధికారులు

ఇచ్చోడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పంటపొలంలో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను అటవీ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. రెంజ్ ఎఫ్ఆర్ఓ పుండలిక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలంలోని గుండి సమీపంలోని పంట పొలంలో అక్రమంగా నిల్వ ఉన్నట్లు సమాచారం రావడంతో అటవీశాఖ సిబ్బందితో కలిసి నిల్వ ఉన్న కలప దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కలప విలువ రూ. 30 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది వివేక్‌రెడ్డి, నౌషిలాల్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన స్కూటీ

ప్రమాదంలో ఢీ కొన్న ఆటో

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందిన ఘటన ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడలో చోటు చేసుకుంది. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడ వంతెన వద్ద ఆటో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బంగారుగూడ గ్రామానికి చెందిన అనిత(40) అనే మహిళ కూలి అక్కడికక్కడే మృతి చెందింది. బంగారిగూడకు ద్విచక్రవాహనం నడుపుతున్న సబ్లే అమర్‌తోపాటు మరొకరికి గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను చికిత్స కోసం రిమ్స్‌కు తలించారు. అనిత మృతదేహన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్‌బియ్యం, నిందితులతో పోలీసులు

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్‌లోని తిరుపెల్లి వద్ద మంగళవారం టూ టౌన్ సీఐ కరుణాకర్, ఐడీ పార్టీ నరేష్, క్రాంతి, నరేందర్ గోపాల్, సంజు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న బొలెరో పికప్ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 35.5 క్వింటాళ్ల రేషన్‌బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. బియ్యం విలువ సుమారు 71 వేలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

● ఒకరు మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు



బోల్తా పడ్డ మ్యాక్స్ వాహనం.. సచిన్ మృతదేహం

తలమడుగు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుచలాపూర్ గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయని ఎస్సై అంజమ్మ తెలిపారు. వివరాల ప్రకారం మహారాష్ట్ర కిన్వర్ట్ ఆదిలాబాద్ వస్తున్న బోలోరా పికప్ వాహనం టీఎస్07యూటీ3317 వాహనం అతివేగంతో రావడంతో కచలాపూర్ గ్రామ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. వాహనంలో ప్రయాణిస్తున్న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన కవలే సచిన్ (39) అక్కడికక్కడే మృతి చెందగా గోపాల్, డ్రైవర్ రహన్‌లకు తీవ్రగాయాలు అయ్యాయి. కావడంతో స్థానికులు గమనించి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. వారు చికిత్స పొందుతున్నారని పోసులు తెలిపారు. అతివేగమే ప్రాణం తీసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనం నడిపితే జరిమానా

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే జరిమానాలు చెల్లించాల్సి వస్తుందని ఆదిలాబాద్ ట్రాఫిక్ సీఐ ప్రణయ్‌కుమార్ హెచ్చరించారు. ట్రాఫిక్ ఇబ్బంది కలిగే విధంగా రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఇష్టారాజ్యంగా వాహనాలు పార్క్ చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. మంగళవారం పట్టణంలోని కొమురం భీం చౌరస్తా వద్ద విస్తృత తనిఖీలు చేపట్టారు.

సోయాబీన్ డబ్బుల కోసం రైతుల ఎదురుచూపులు

భోథ్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గత నెల నుంచి మండలంలో సహకార సంఘం ఆధ్వర్యంలో సోయాబీన్ పంట కొనుగోలు ప్రారంభమయ్యాయి. పంట కొనుగోలు ప్రారంభమై దాదాపు 25 రోజులు పూర్తి కావస్తున్నా రైతులకు మాత్రం ఇంత వరకు డబ్బులు అందడం లేదని వాపోతున్నారు. ఈ ఏడాది సోయాబీన్ పంట దిగుబడి అంతంత మాత్రమే ఉందని మధ్య దళారీలకు తక్కువ ధరకు అమ్మకుండా ప్రభుత్వానికి విక్రయిస్తే డబ్బులు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

● చేతిలో చిల్లిగవ్వలేదు

తాను పండించిన సోయాబీన్ పంటను ప్రభుత్వానికి గత నెల 15న విక్రయించడం జరిగిందని అయితే పంటకు సంబంధించిన డబ్బులు పది రోజుల్లో అందుతాయి అనుకుంటే దాదాపు 25 రోజులు కావస్తున్నా పంట డబ్బులు అందక ఇబ్బందులకు గురవుతున్నామని రైతు పుండ్రు సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం రైతు కూలీలకు కైకిల్లా డబ్బులు ఇస్తామంటే తమ దగ్గర చిల్లి గవ్వలేదని వాపోయారు.

అధికారులు పంట విక్రయించిన రైతులకు సకాలంలో డబ్బులు అందించాలని కోరారు.

● ధర వస్తుందనుకుంటే.. : సుభాష్‌రెడ్డి (రైతు)

తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందని ప్రభుత్వ రంగ సంస్థలకు విక్రయిస్తే సకాలంలో డబ్బులు రాక ఇబ్బందులకు గురవుతున్నామని మండలంలోని పలు గ్రామాల రైతులు వాపోతున్నారు. క్వింటాల్‌కు రూ.400 నుంచి 500 తక్కువ ధరకు విక్రయిస్తే నష్టపోతామని ప్రభుత్వం అని అంటున్నారు. మధ్య దళారీలను నమ్మకుండా ప్రభుత్వానికి విక్రయిస్తే డబ్బులు రాకపోవడంతో రైతులు సతమతమవుతున్నారు. అధికారులు డబ్బులు పంపిణీపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఐటీడీఏ ముందు బీఆర్ఎస్వీ ధర్నా



ఐటీడీఏ పరిపాలన అధికారికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్వీ నేతలు

ఉట్నూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అధికారం కొనసాగిస్తున్న ప్రజా ప్రభుత్వం గత 11 నెలల నుంచి విద్యార్థులను మోసం చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి నాయకులు మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేసేంత వరకు కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి పైన పోరాటం చేస్తామని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ అన్నారు. ఇంటర్, డగ్రీ, పీజీ విద్యార్థులతో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై విద్యార్థులంతా సంఘటితంగా పోరాడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి సరిపడ నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తుందని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో బాబాశ్యామ్, క్రాంతి, భూమన్న, సాజిద్, జాడి వెంకటేశ్, శ్రీకాంత్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేకు సర్వం సిద్ధం

(3వ పేజీ తరువాయి...)

ఒక్కో సిబ్బందికి రూ.700 చొప్పున చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే సర్వే ఫాంలో కొన్ని మార్పులు, చేర్పులు చేస్తూ ప్రభుత్వం చివరి సమయంలో నిర్ణయం తీసుకుంది. దీంతో సిబ్బందికి శిక్షణను పూర్తి చేసిన కొన్ని అంశాలపై అవగాహన లేకుండా పోయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే సమగ్ర కుటుంబ సర్వేను చేపట్టేందుకు మొదట ఇంటింటికీ సర్వే స్టిక్కర్లను అతికించే కార్యక్రమాన్ని చేపట్టారు. అంతేకాకుండా దీని ఆధారంగానే సమగ్ర కుటుంబ సర్వేను చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ జిల్లాలో ఒకేరోజు సర్వే స్టిక్కర్లు అతికించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ తర్వాత ఈ కార్యక్రమాన్ని నిలిపి వేశారు. దీంతో సర్వే స్టిక్కర్ల పంపిణీ కార్యక్రమం అర్ధాంతరంగానే నిలిచిపోయింది.

పకడ్బందీగా సమగ్ర సర్వే

: జితేందర్‌రెడ్డి, జడ్పీ సీఈవో, నోడల్ అధికారి ఆదిలాబాద్



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా కుటుంబ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలతో కూడిన సమగ్ర సర్వేను చేయాల్సి ఉంది. ఇప్పటికే సర్వే చేసేందుకు ప్రత్యేకంగా ఎన్యూమరేటర్ల నియామకం పూర్తయ్యింది. ఉదయం 9గంటల నుంచి రాత్రి వరకు ఇంటింటా సర్వేను నిర్వహించడం జరుగుతుంది. కుటుంబ యజమానులు సర్వే సిబ్బందికి సహకరించి విజయవంతం చేయాలి.

వ్యాధి నిరోధక టీకాలు సద్వినియోగం చేసుకోవాలి

నేరడిగొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి రాథోడ్‌జీవన్ అన్నారు. మంగళవారం మండలంలోని యాపల్‌గూడ, ఇస్రుగూడ, బోరిగాం గ్రామాలలో సామూహిక గాలికుంటు వ్యాధి నిరోధక కార్యక్రమంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావు పటేల్



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంరావు పటేల్

ముథోల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావు పటేల్ అన్నారు. మండలంలోని చించాల, వెంకటాపూర్, కారేగాం, చింతకుంట, బోరేగాం, వడ్తాల్, విట్టోలి, ముథోల్ గ్రామాల్లో పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని నిబంధనల ప్రకారం తీసుకొచ్చి మద్దతు ధరను పొందాలని సూచించారు. రైస్‌మిల్లర్ల కోతలను ఎట్టి పరిస్థితిలో సహించేది లేదని స్పష్టం చేశారు. రైతుల అభివృద్ధి కోసం తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, పీఏసీఎస్ చైర్మన్ తీగల వెంకటేష్‌గౌడ్, వైస్ చైర్మన్ సాయిరాం, మాజీ ఎంపీపీ ఎజాజ్ ఉద్దీన్, బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న, నాయకులు సాంబ్లీ రమేష్, నర్సాగౌడ్, నిమ్మ పోతన్న, దత్తాద్రి, శివరాం, రోళ్ల రమేష్, సుదర్శన్, శ్రీనివాస్, సంతోష్, గంగాధర్, భూమన్న, శివరాం, ఆయా గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

భైంసా, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ పరిధిలో బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోందని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం భైంసాలో పార్టీ ప్రతినిధుల ఆధ్వర్యంలో బీజేపీ క్రియాశీలక సభ్యత్వాన్ని స్వీకరించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంస్కరణలు మూలంగా బీజేపీ సభ్యత్వ నమోదు అపూర్వంగా ఆదరణ దక్కుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజలు పార్టీ సభ్యత్వ నమోదుకు స్వచ్ఛందంగా ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తలకు, నాయకులకు బీజేపీలో ప్రత్యేక గుర్తింపుతో పాటు రానున్న రోజుల్లో సముచిత ప్రాధాన్యం, స్థానం కల్పిస్తామని స్పష్టం చేశారు. వంద సభ్యత్వాలు నమోదు చేసిన ప్రతి కార్యకర్త,నాయకునికి క్రియాశీలక సభ్యత్వం అందిస్తామని వివరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా సభ్యత్వ నమోదు కో ఆర్డినేటర్ సిరం సుష్మారెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ పోతుగంటి సుమన్, అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ రుషి రవికుమార్‌లు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్‌కు క్రియాశీలక సభ్యత్వ నమోదున అందచేశారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరు

● పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా.వి.నరేందర్‌రెడ్డి



భైంసా సమావేశంలో మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా.వి.నరేందర్‌రెడ్డి

భైంసా, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపిస్తే ఉద్యోగ,నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని రీతిలో పోరు చేపడుతానని మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్,కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ డా.వి.నరేందర్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం భైంసా పట్టణంలో ఓటర్ అవగాహన, నవ సమాజ స్థాపనలో పట్టభద్రుల పాత్ర పేరిట నిర్వహించిన సెమినార్ కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల ఉపాధ్యాయులు, ఆధ్యాపకులు, న్యాయవాదులు, వివిధ సంఘాలతో సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. నిరుద్యోగులకు ఉద్యోగ,ఉపాధి అవకాశాల కల్పన బాధ్యతాయుతమైన విధానాల ద్వారా అంకితభావంతో కృషి చేస్తానన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులందరికి హెల్త్‌కార్డుల మంజూరి కోసం పాటుపడుతానని తెలిపారు. ప్రైవేట్ డిగ్రీ , పీజీ కళాశాలల యాజమాన్యాలకు ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ విడుదలయ్యేలా చర్యలు చేపడుతానన్నారు. మోడల్ స్కూల్, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు గెస్ట్, పార్ట్ టైమ్ ఆధ్యాపకులకు 010 జీవో ప్రకారం వేతనాలు అందించే విధంగా కృషి చేస్తానని వెల్లడించారు. న్యాయవాదుల రక్షణ కోసం అడ్వోకేట్ ప్రోటెక్ట్ యాక్టు తీసుకవచ్చే దిశగా వ్యవహరిస్తానన్నారు. యువ న్యాయవాదులకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం కోసం బాధ్యతాయుతంగా పాటుపడుతానని స్పష్టం చేశారు. పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అవిశ్రాంతంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలు సంఘాల ప్రతినిధులు, పలు ప్రైవేట్ విద్యా సంస్థల ఉపాధ్యాయులు , ఆధ్యాపకులు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా. వి.నరేందర్ రెడ్డికి పూర్తి మద్దతు ప్రకటించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● నిర్మల్‌లో వైద్య విద్యార్థులకు అవగాహన

నిర్మల్ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసుశాఖ పిలుపునిచ్చింది. మంగళవారం నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో షీటీమ్స్, భరోసా కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై సుమాంజలి మాట్లాడుతూ పోకిరీల వేధింపులకు గురికాకుండా ఉండేందుకు షీటీమ్స్ పోలీసు సిబ్బందిని ఆశ్రయించాలన్నారు. మహిళలు, విద్యార్థినుల రక్షణకు పోలీసుశాఖ ప్రాధాన్యమిస్తోందన్నారు. పోలీసు సహాయం కోసం 100 నెంబర్ ఉపయోగించుకోవాలని సూచించారు. సమాజంలో సైబర్ నేరాలు పెరిగిపోతు న్నాయని జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా ఉండాలన్నారు. ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. మత్తు పదార్థాలు, గంజాయి లాంటి మాదకద్రవాల జోలికి యువత వెళ్లవద్దని వాటిని వారించేందుకు బాధ్యత వహించాలన్నారు. కళాబృందం ఈ సందర్భంగా ఆయా అంశాలపై ప్రదర్శనలిచ్చి విద్యార్థులకు అవగాహన కల్పించారు. షీ టీమ్, భరోసా సిబ్బంది, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్‌హాది



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

సారంగాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్‌హాది అన్నారు. మంగళవారం మండలంలోని చించోలి(ఎం), ధని, చించోలి(బి), జౌలి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ధాన్యం క్వింటాల్ ధర రూ.2,320 ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శంకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ముక్తార్, నాగారావు, సురేందర్‌లతో పాటు ఐకేపీ ఏపీఎం మాధురి, నాయకులు, రైతులు, తదితరులు ఉన్నారు.

చింతల్‌చందా, చామన్‌పల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతల్‌చందా, చామన్‌పల్లి గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఈ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పలువురు నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మోహన్, చింతల్‌చందా గ్రామస్తులు అశోక్, ప్రభాకర్, హన్మాండ్లు, నరహరి, తాండ్ర రాజేశ్వర్, రాజేందర్, సాయన్న, చామన్‌పల్లి మాజీ సర్పంచ్ పడిగెల గంగాధర్, ఎంపీటీసీ పడిగెల సురేష్, గ్రామస్తులు మార వెంకట్ రెడ్డి, నూకల దేవన్న, ఏలేటి గంగారెడ్డి, సంత సాగర్ రెడ్డి, నూకల వినోద్, బొమ్మెన మధు, కుంటాల శ్రీనివాస్, బి. మల్లేష్, ఆకుల సాయన్న, ఏలేటి సురేష్, ఏలేటి సంజీవ్ రెడ్డి, నూకల మహేష్, నూకల రమణ, నూకల గంగయ్య, ఎం. లింగయ్య, ఏలేటి కిరణ్, ఏనుగు ప్రసాద్, మండల వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తానూర్ సొసైటీ ద్వారా చెక్కు పంపిణీ



మృతురాలి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావుపాటిల్, పీఏసీఎస్ సిబ్బంది

తానూర్, నవంబరు 5 : మండలంలోని కోలూర్ గ్రామానికి చెందిన పూజేకర్ గంగాబాయి ఇటీవల అనారోగ్యంతో మరణించింది. కాగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం హెడ్‌క్వార్టర్ తానూర్‌లో మృతురాలు పూజేకర్ గంగాబాయి వ్యవసాయ పంట రుణం తీసుకోగా ఆమె పేరిట భీమా కంపెనీకి సొసైటీ వారు ఇన్సురెన్సు కట్టడంతో రూ. 2లక్షల ఇన్సూరెన్సు మంజూరు అయింది. దీంతో మంగళవారం పీఏసీఎస్ హెడ్‌క్వార్టర్ తానూర్ సంఘం చేత పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావుపాటిల్, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్, సీఈవో భూమయ్య చేతుల మీదుగా మృతురాలి కుటుంబ సభ్యులు పూజేకర్ జీవన్, పూజేకర్ నికితకు రెండులక్షల చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ పుండ్లీక్, గోవింద్‌రావుపాటిల్, బ్యాంకు సిబ్బంది శ్రీకాంత్, కోలూర్ గ్రామస్తులు తదితరులున్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపిక

కుభీర్, నవంబరు 5 : మండల కేంద్రం కుభీర్‌లోని ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్‌సీసీ విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఎన్‌సీసీ కేర్ టేకర్ పార్థసారథి తెలిపారు. ఆదిలాబాద్ నుంచి వచ్చి ఎన్‌సీసీ అధికార బృందం హవల్దార్ రమేష్, నాయబ్‌దార్ సునీల్‌లు పాఠశాలను సందర్శించి 62 మంది విద్యార్థులను ఎన్‌సీసీకి ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. వారికి శారీరక, కంటి పరీక్షలను నిర్వహించి గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు హరిహరనాథ్, ఉపాధ్యాయులున్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారుల దాడి

కుంటాల, నవంబర్, 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలలో పలు ఎరువుల దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడి నిర్వహించారు. కరీంనగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దినేష్‌రెడ్డి, అనిల్‌కుమార్, భైంసా రూరల్ ఏవో ఆసంరవి పాల్గొని విత్తన దుకాణాల డీలర్లకు సూచనలు, సలహాలు అందజేశారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించకూడదని, రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ముథోల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని ఆశ్రమ పాఠశాలలో మంగళవారం మెస్ ఛార్జీలు పెంచినందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి విద్యార్థులు క్షీరాభిషేకం చేసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రావుల గంగారెడ్డి, నాయకులు గోపిడి ప్రేమ్‌నాథ్ రెడ్డి, అజీజ్, దిగంబర్, పతంగి కిషన్, సోషల్ మీడియా ఇంచార్జి ఎస్‌కే. నజీమ్ అహ్మద్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

లక్ష్మణచాంద, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను మండలంలో పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో రాధా రాథోడ్ మంగళవారం అన్నారు. ఉపాధ్యాయులకు, ఇతర సిబ్బంది శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆమె మాట్లాడుతూ... ప్రతి 150 గృహాలకు ఒక ఎన్యుమరేటర్‌ను నియమించామని, 56 కాలం ప్రొఫార్మాను అందించి వాటి వివరాలను అందులో పొందుపరచాలని తెలియజేశామన్నారు. మండలంలోని కేజీబీవీ పాఠశాలను జిల్లా ప్రజా పరిషత్ సీఈవో గోవింద్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం గురించి, భోజనాన్ని గురించి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధా రాథోడ్, ఎంపీవో అమీర్‌ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలు


జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, ఐటీడీఏ పీవో

అట్టహాసంగా ప్రారంభమైన

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

- క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించిన ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, అనిల్‌జాదవ్, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త
- రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు

ఉట్నూర్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉట్నూర్ ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి గిరిజన విద్యార్థుల క్రీడా ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న కొమురం భీం క్రీడా మైదానంలో 33 జిల్లాలకు చెందిన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న 1600 మంది క్రీడాకారులతో గిరిజన క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదిలాబద్ ఎంపీ గోడంనగేష్ ముఖ్య అతిథిగా హాజరుకాగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అధ్యక్షత వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆదేశాల మేరకు ఇన్‌చార్జీ డీడీ వసంతరావు నేతృత్వంలో జిల్లా క్రీడల అధికారులు పార్థసారథి, ముఖ్య రమేష్, బండ జీవరత్నం, మీనారెడ్డి, మధుసూదన్, విశ్వనాథ్ తదితరులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయగా.. ప్రాంగణానికి చేరుకున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, ఐటీడీఏ పీవోతో పాటు కుమ్ర ఈశ్వరీబాయిలను స్కౌట్ విద్యార్థులు స్వాగతించారు. ముందుగా క్రీడా పతాకాన్ని.. ఆ తర్వాత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భద్రాచలం, ఏటూరు నాగారం, ఉట్నూర్ ఐటీడీఏ 1, 2, మైదాన ప్రాంతాల ఐటీడీఏ 1, 2లకు చెందిన క్రీడాకారులు గౌరవ వందనాన్ని అతిథులు అందుకున్నారు. జ్యోతి ప్రజ్వలనతో పాటు క్రీడాజ్యోతిని వెలిగించారు.

● జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి : ఎంపీ

ప్రకృతి ఒడిలో పెరిగిన ఆదివాసీ గిరిజన బిడ్డలు జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎదగాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. చిన్నతనం నుంచే సహజంగా గిరిజన విద్యార్థుల్లో క్రీడల పట్ల మక్కువ ఉంటుందన్నారు. సహజ సిద్ధంగానే స్థానిక ఆటల్లో ప్రావీణ్యం పొందుతూ వచ్చిన గిరిజన విద్యార్థులు పాఠశాలల స్థాయిలో మరింత పట్టు సంపాదించుకుంటారని అన్నారు. గిరిజన విద్యార్థులకు క్రీడా శిక్షణలు అందిస్తే ఉత్తమ క్రీడాకారులుగా ఎదగడానికి ఎక్కువ సమయం పట్టదు అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని జాతర్లలో ఒక క్రీడా పాఠశాలను ముందుగా ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏడు ఆదర్శ క్రీడా పాఠశాలలు ఏర్పాటు అయ్యాయన్నారు. జా తర్ల పాఠశాలలో మరికొన్ని రోజుల్లో కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తనను కేంద్ర స్థాయిలో క్రీడల అభివృద్ధి కమిటీలో సభ్యునిగి నియమించినందుకు ఆదిలాబాద్ జిల్లాకు కావాల్సిన క్రీడల సౌకర్యాలను ఏర్పాటు చేస్తానని ఇక్కడి అవసరాలను గుర్తించి అధికారులు ప్రతిపాదనలు తయారు చేయాలని ఐటీడీఏ పీవోను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం విద్య అభివృద్ధి, క్రీడల అభివృద్ధి పట్ల మక్కువ చూయిస్తారని ఖానాపూర్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిధులు పొందామని అన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ మాట్లాడుతూ ఉత్తమ క్రీడాకారులుగా ఎదుగుతున్న క్రీడాకారులకు ఉద్యోగ నియమకాలలో రిజర్వేషన్లు కల్పించే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని అన్నారు. ఇటీవలజరిగిన పలు ఉద్యోగ నియమకాలలోక్రీడాకారులకు తగిన గుర్తింపు ఇవ్వలేదని పలువురు పోయాని తెలిపారు క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం రూ.32 0కోట్లు కేటాయించిందన్నారు. విద్య అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ఆహర్నిశలు కృసి చేస్తున్నారని పాఠశాలల బాగోగుల కోసం అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాలుచేపట్టడం జరిగిందన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా పని చేసిన అనుభవం ఉన్న గోడంనగేష్‌తో కలిసి ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి క్రీడా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఇప్పటికే ఉట్నూర్‌లో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కోటి రూపాయలతో ప్రతిపదనలు ముఖ్యమంత్రికి సమర్పించడం జరిగిందన్నారు. ఇంకా అవసరమైన ప్రతిపాదనలు ఉంటే తమ దృష్టికి తెస్తే ముఖ్యమంత్రిని కలిసి నిధులు అడుగుతామని అన్నారు.ఉట్నూర్‌లోని క్రీడా ప్రాంగణాలను ఆధునకరించాల్సిన అవసరం ఉందని, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరు నిబద్ధతతో పని చేసే ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తున్నందున క్రీడాకారులు ఎదగాలని అన్ని క్రీడల్లో రాణించాలన్నారు. ఉద్యోగ నియమకాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడకారులకు ప్రత్యేక రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. అప్పుడే చదువుతో పాటు క్రీడల పట్ల గిరిజన విద్యార్థులు ఆకర్షితులవుతారన్నారు. గిరిజన సంక్షేమ శాఖ విద్యా విభాగం డిప్యూటీ డైరెక్టర్ చందన సర్పే మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఆజతీయ అంతర్జాతీయ స్థాయిలో ఎదుగుతున్నారని అభినందించారు.

● తొలిరోజు 800 మీటర్ల పరుగు పందెం

రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడోత్సవాలలో భాగంగా తొలి రోజున 800 మీటర్ల బాల బాలికల పరుగు పందెం పోటీలను ఎంపీ, ఎమ్మెల్యేలు, ఐటీడీఏ పీఓలు ప్రారంభించారు. ఆరు జోన్లకు చెందిన విద్యార్థులు 800 మీటర్ల పరుగు పందెంలో పాల్గొనగా బాలుర పోటీలలో ఉట్నూర్ ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన జాతీయ క్రీడాకారుడు పరశురాం బంగారు పతకం అందుకోగా జాతర్ల క్రీడా పాఠశాలకు చెందిన మహేశ్ కాంస్య పథకాన్ని, ఏటూరు నాగారం ఐటీడీఏకు చెందిన విద్యార్థి సతీస్ రజత పథకం అందుకున్నారు. బాలికల విభాగంలో మైదాన ప్రాంత ఐటడీఏకు చెందిన లిఖిత బంగారు పతకం అందుకోగా ఆసిఫాబాద్ క్రీడ పాఠశాలకు చెందిన మడావి చిన్నుబాయి కాంస్య పథకం, హైదరాబాద్ టూ మైదాన ప్రాంతం ఐటీడీఏకు చెందిన ప్రసన్నకంచనవల్లి రజత పథకం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర క్రీడల అధికారిజ్యోతి, ఇన్‌చార్జీ డీడీ వసంతరావు, మంచిర్యాల డీటీవో మడావి గంగారాం, నిర్మల్ డీటీఓ జాదవ్ అంబాజి, ఆసిఫాబాద్ డీడీ రమాదేవి, మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీ బాయి, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.


స్టేడియంలో జోన్ 3 ఉట్నూర్-1 క్రీడాకారులు


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు


విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఆనాటి.. జ్ఞాపకం!!


నర్సాపూర్‌లో ఓ ఇంటి ఆవరణలో మూలన పడి ఉన్న ఎడ్లబండి

కనుమరుగవుతున్న పల్లె రథం

- యంత్రాల వినియోగంతో కనిపించని ఎడ్లబండ్లు
- సౌలభ్యంగా ఉండటంతో ట్రాక్టర్లపైనే రైతుల ఆసక్తి

ఇచ్చోడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతన్నల జీవితాల్లో మమేకమై ఎన్నో విధాలా సేవలందించిన పల్లె రథం ప్రస్తుతం కనుమరుగవుతోంది. అనాదిగా పల్లె ప్రజలకు విశేష సేవలందించిన ఎడ్లబండి క్రమేపి రైతన్నల జీవితాల నుంచి దూరమవుతోంది. సేద్యం పనులు మొదలుకొని సరకుల రవాణా, ప్రజల ప్రయాణానికి సైతం ఎంతగానో ఉపయోగపడిన ఎడ్లబండి చూద్దామంటే కనిపించకుండా పోతుంది. తొలకరి వర్షాలు కురవగానే రైతన్నలు నాగలి, గొర్రు, పార, తదితర వ్యవసాయ పరికరాలను ఎడ్లబండిపై పెట్టుకొని పొలాలకు వెళ్లి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యేవారు. పొలం దుక్కి నుంచి పంట కోత వరకు యంత్రాలు రంగప్రవేశం చేయడంతో పురాతన వ్యవసాయ పరికరాలు కనుమ రుగవుతున్నాయి.

● రైతుల విలువైన ఆస్తులు!!

ఇదివరకు ఇంటి ముంగిట కాడెద్దులు, ఎడ్లబండిని విలువైన ఆస్తులుగా రైతులు భావించేవారు. ఎద్దులను ఎంతో ప్రేమగా సాకుతూ.. రెండు, 3 రోజులకు ఒకసారి శుభ్రంగా కడిగేవారు. ఎడ్లబండి చక్రాలకు రకరకాల రంగులు, ముగ్గులు వేసేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యాంత్రికత పెరుగుతుండటంతో క్రమేనా ఎడ్లబండ్ల వినియోగం తగ్గుతూ వస్తోంది. ఎంతో ప్రాధాన్యం కలిగిన ఎడ్లబండికి ఆధునికి వ్యవసాయ పద్ధతులు విరామం కల్పించడమే కాకుండా కనుమరుగయ్యేలా చేస్తున్నాయి. ప్రస్తుతం ఆధునిక పరికరాలలో భాగంగా ట్రాక్టర్ల వినియోగం పెరిగిపోతోంది. దీంతో ఆనాటి పల్లె రథం కనుమరుగైందంటున్నారు. ఎడ్లబండ్లు, వ్యవసాయ పరికరాలు రోజురోజుకు కనిపించకుండా పోతుండటంతో భావితరాల వారు ప్రదర్శనశాలల్లో చూడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. అన్నదాతలకు ఎన్నోరకాలుగా సేవలందించిన ఎడ్లబండి కనుమరుగువుతున్న తరుణంలో 'పల్లెరథం'పై ప్రత్యేక కథనం.!!


కుటుంబ సమేతంగా ఎడ్లబండిపై పొలానికి వెళ్తున్న రైతు(ఫైల్)

పశువుల సంత.. సమస్యల చింత

- ఉట్నూర్‌లో సంత నిర్వహణకు సరైన స్థలం లేక రైతుల ఇక్కట్లు
- ప్రధాన రహదారికి పక్కనే నిర్వహిస్తుండడంతో వాహనదారులకూ తప్పని తిప్పలు
- ఆదాయం ఉన్నా.. సౌకర్యాలు సున్న!!



ఉట్నూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని లింగోజితండా ఎక్స్‌రోడ్డు వద్ద ప్రతీ శుక్రవారం ఏర్పాటు చేస్తున్న పశువుల సంతకు సరైన స్థలం లేక పోవడంతో రైతులు వ్యాపారులు చింతకు గురవుతున్నారు. మండుతున్న ఎండలు ఒక వైపు ఉండగా మూతబడ్డ ఐటీడీఏ పారిశ్రామిక వాడ ఎదుట ప్రధాన రహదారికి సమీపంలో పశువుల సంత నిర్వహిస్తుండడంతో వాహనదారులకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న పశువుల సంతకు ఉ మ్మడి జిల్లాలోని జైనూర్, ఇచ్చోడ, ముత్తునూరు, ఊషేగం, నార్నూర్, తాడిహత్నూర్, గాదిగూడ, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ రెబ్బెన, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, ఇందనపల్లి, జన్నారం, కడెం, ముత్యంపేట, దండెపల్లి తదితర ప్రాంతాల నుంచి రైతులు వ్యాపారులు పశువుల కొనుగోలు కోసం తరలివస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు పశువులను తమ వాహనాలలో తీసుకువచ్చి పశువుల సంతలో విక్రయిస్తున్నారు. పశువులకు తాగునీటి తొట్టెలు లేక పోవడంతో పాటు వచ్చిన వ్యాపారులకు రైతులకు సైతం మంచినీటి సౌకర్యం అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారు.

● సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలం

లింగోజి తండా ఎక్స్‌రోడ్డు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువుల సంతకు ఆదాయం ఉన్న సౌకర్యాలు కల్పించడంలో పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారని రైతులు వాపోతున్నారు. పశువుల సంత వేలం ద్వారా ప్రతియేటా లక్షకు పైగా రూపాయలు వస్తున్న పంచాయతీ అధికారులు రైతులకు, వ్యాపారులకు, పశువులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించడం లేదని, ఇప్పటికైనా అధికారులు పశువుల సంత ద్వారా వస్తున్న ఆదాయంతో సౌకర్యాలు కల్పించాలని రైతులు వ్యాపారులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన

సౌకర్యాలు కల్పించాలి

: పుర్క బాపురావు, జిల్లా అధ్యక్షుడు, తుడుందెబ్బ



జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో నిర్వహిస్తున్న పశువుల సంతలకు ఎక్కడ కూడా సౌకర్యాలు కల్పించడం లేదు. దీనికి సంబంధించి స్థానిక గ్రామ పంచాయతీలకు వస్తున్న ఆదాయంతో రైతులకు, పశువులకు కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలి

: భీమ్‌రావు, రైతు, భీర్సాయిపేట



లింగోజితండా ఎక్స్‌రోడ్డు వద్ద ప్రతీ శుక్రవారం నిర్వహిస్తున్న పశువుల సంత స్థలంలో నీటి తొట్టెలను సత్వరమే ఏర్పాటు చేయాలి. అలాగే పశువులకు నీటి సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది. సిమెంట్ తొట్టీలు ఏర్పాటు చేసి వాటిల్లో పంచాయతీ సిబ్బంది ద్వారా నీళ్ల నింపితే పశువులకు నీటి ఇబ్బందులు ఉండవు.

సౌకర్యాలు కల్పిస్తాం

: మహేశ్‌కుమార్, ఎంపీవో, ఉట్నూర్



పశువుల సంత వేలం ద్వారా స్థానిక గ్రామ పంచాయతీకి రూ.1.50 లక్షల ఆదాయం వస్తోంది. అయితే, రైతులు, వ్యాపారుల కోరిక మేరకు పశువుల సంతకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తాం. గతంలో నీటి తొట్టెలు ఏర్పాటు చేశాం. అంతేకాకుండా త్వరలోనే మరికొన్ని ఏర్పాట్లు చేస్తాం.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన సంగెం నవీన

లక్ష్మణచాంద, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన సంగెం నవీన కామారెడ్డిలో మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించి గర్వకారణంగా నిలిచింది. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌ల ద్వారా ఎంపికై నిర్మల్‌లోని రవి హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న ఈ బాలిక రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో గోల్డ్ మెడల్ సాధించటం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేసి అభినందించారు.


సంగెం నవీన

యునైటెడ్ నేషన్స్ సదస్సులో ఆర్జీయూకేటీ విద్యార్థిని



సదస్సులో బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థి లహరి

బాసర, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీకి చెందిన విద్యార్థిని లహరి (ఈసీఈ నాల్గవ సంవత్సరం) యునైటెడ్ నేషన్స్‌లో ఇంటర్ పోల్ కౌన్సిల్‌గా భారతదేశం నుంచి ప్రాతినిథ్యం వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అభినందిస్తూ విద్యార్థిని లహరి మిగితా విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ప్రతీ సంవత్సరం నిర్వహించే ఐక్య రాజ్యసమితి అంతర్జాతీయ ఆసియా యువత సదస్సు ఈసారి థాయ్‌లాండ్‌లో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో దాదాపు 36 దేశాల నుంచి మొత్తం 700 మంది ప్రతినిధులతో పాల్గొన్నారు. అంతేకాకుండా విద్యార్థిని లహరి సమావేశంలో ప్రసంగిస్తూ సాంస్కృతిక మార్పిడి యొక్క ప్రాముఖ్యతను, ప్రపంచ విధానాలను రూపొందించడంలో యువత పాత్ర, సమర్థవంతమైన కమ్యూనికేషన్ ప్రభావాన్ని తెలియజేశారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా గ్లోబల్ సమస్యలు సాంస్కృతిక, సామాజిక అడ్డంకులను అదిగమించి అందరికి ఉజ్వల భవిష్యత్తును అందించే విధానాన్ని వివరించారు. లహరినీ విశ్వవిద్యాలయం అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు అభినందించారు.





కల్తీ కాటు!

- జిల్లాలోని హోటళ్లలో నాణ్యత లేని ఆహారం
- వినియోగదారుల ప్రాణాలతో చెలగాటం
- ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోని యంత్రాంగం
- వరుస సంఘటనలతో జనం బెంబేలు
- తాజాగా నాణ్యత లేని బిర్యానీ తిని ఓ యువతి మృతి

నిర్మల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కల్తీహోటళ్లు రాజ్యమేలుతున్నాయని ఆరోపణలున్నాయి. నిర్మల్ పట్టణంతో పాటు భైంసా ఖానాపూర్ పట్టణాల్లోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో నాణ్యత లేని ఆహారాన్ని అందిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్న విమర్శలున్నాయి. రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో చికెన్ బిర్యానీ తిన్న దాదాపు 20మందికి పైగా వ్యక్తులు ఫుడ్ పాయిజన్‌కు గురై ఆసుపత్రి పాలయ్యారు. వీరిలో నుంచి బోథ్‌కు చెందిన ఓ మహిళ ఇదే హోటల్‌లో చికెన్ బిర్యానీ తిని మృత్యువాత పడ్డారు. అలాగే అదే ప్రాంతానికి చెందిన మరో ఐదుగురు ప్రస్తుతం అక్కడి ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. వీరితో పాటు నిర్మల్‌కు చెందిన దాదాపు 10 మందికి పైగా వ్యక్తులు ప్రస్తుతం ఇక్కడి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్సలు పొందుతున్నారు. జిల్లాకేంద్రంలో గత కొంతకాలం నుంచి ఇక్కడి హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఇష్టారాజ్యంగా ఆహారాన్ని తయారు చేసి విక్రయిస్తున్నాయంటున్నారు. కుళ్లిపోయిన చికెన్, మటన్‌తో పాటు ప్రాణాంతకమైన రంగులు, కాలం చెల్లిన మసాల దినుసులను, మంచి సువాసనలు, రుచుల కోసం రసాయనాలు వినియోగించి బిర్యానీలు స్టార్టర్స్‌ను తయారు చేసి జనాలకు అంటగడుతున్నాయంటున్నారు. ఆకర్షణీయమైన రంగులు, సువాసనతో కూడిన మసాలాలు వినియోగించి ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారన్న విమర్శలున్నాయి. కొంతకాలం నుంచి కల్తీ ఆహారం కేసులు కుప్పలు తెప్పలుగా తెరపైకి వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం ఈ దిశగా దృష్టి సారించడం లేదంటున్నారు. ఆహార కల్తీ నియంత్రణ అధికారులు సరైన తనిఖీలు, పర్యవేక్షణలు చేపట్టక పోతుండడంతో హోటళ్ల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న వాదనలున్నాయి. కాసుల కోసం కక్కుర్తి పడుతూ ప్రజల ప్రాణాలను లెక్కచేయకుండా అడ్డగోలు ఆహార పదార్థాలను అమ్ముకుంటున్నారంటున్నారు. ఆకర్షణీయంగా హోటళ్లను నిర్మించి రుచికరమైన వంటల పేరిట రకరకాల పేర్లతో వాటిని విక్రయిస్తూ ప్రజలను ప్రాణ ప్రమాదంలోకి నెట్టుతున్నారంటున్నారు. అధికారులు అడపదడప తూతూ మంత్రపు తనిఖీలతో చేతులు దులుపుకుంటున్నారే తప్ప పకడ్బందీగా తనిఖీలు చేపట్టకపోతుండడం అనుమానాలకు తావిస్తోందంటున్నారు. అధికారుల నియంత్రణ లేని కారణంగా హోటల్ యజమానులు కల్తీ ఆహారాన్ని వినియోగదారులకు అంటగట్టి చోద్యం చూస్తున్నారంటున్నారు. సంఘటన జరగగానే హడావుడి చేయడమే తప్పా.. ఆ తర్వాత షరా మామూలే అన్న చందంగా మారుతోంది. ప్రజలు కల్తీ ఆహారం విషయంలో స్వయంగా చైతన్యవంతమైతే తప్ప దీనిని అడ్డుకోవడం కష్టతరమేనంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కల్తీ ఆహారం విషయంలో ప్రత్యేక దృష్టిసారించి కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆందోళన రేకెత్తిస్తున్న వరుస సంఘటనలు

ఇదిలా ఉండగా జిల్లాలో జరుగుతున్న కల్తీ ఆహారం సంఘటనలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆకర్షణీయమైన ప్రకటనలు, భారీ డిస్కౌంట్‌ల పేరిట వినియోగదారులను ఆకర్షిస్తున్న కొన్ని హోటళ్లు అక్కడ కల్తీ ఆహారాన్ని అందిస్తూ జనాన్ని రోగాల పాలు చేస్తున్నాయి. సంఘటన జరగగానే సంబంధిత ఆహార నియంత్రణ అధికారులు ఆగమేఘాల మీద ఒకటి రెండు హోటళ్లను తనిఖీ చేసి నామమాత్రపు కేసులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారంటున్నారు. కొద్దిరోజుల క్రితం జిల్లాకేంద్రంలోని ఓ హోటల్‌లో ఉన్నతాధికారులకు కల్తీ చికెన్ బిర్యానీ అందించింది. అయితే అది కల్తీ ఆహారం అని గుర్తించిన అధికారులు అప్పటికప్పుడే హోటల్‌లోని కిచెన్‌ను తనిఖీ చేసి విస్తుపోయారు. అక్కడి రిఫ్రిజిరేటర్‌లో కిలోల కొద్ది కుళ్లిపోయిన మటన్, చికెన్‌తో పాటు ఇతర ఆహార వస్తువులను అధికారులు గుర్తించారు. ఆ హోటల్‌పై కేసు కూడా నమోదు చేశారు. ఈ సంఘటన తర్వాత ఓ వారం రోజుల పాటు అన్ని హోటళ్లల్లో కొంత మేర నాణ్యమైన ఆహారాన్ని అందించిన యజమానులు మళ్లీ కల్తీ బాటనే పట్టారు. హోటల్ యజమానులు రెస్టారెంట్ యజమానులంతా సిండికేట్‌గా ఏర్పడి కల్తీఆహారం తయారీని ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇదిలా రెండు రోజుల క్రితం స్థానిక ఏఎన్ రెడ్డికి కాలనీకి ఆనుకొని ఉన్న ఓ హోటల్‌లో కల్తీ ఆహారం తిని దాదాపు 20 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో నుంచి ఓ యువతి కల్తీ నాణ్యత లేని మండీ చికెన్ బిర్యానీ తిని ప్రాణాలను కోల్పోయింది.

అధికారుల తీరుపైనా అనుమానాలు

కాగా హోటళ్లపై తనిఖీలు అలాగే వాటిపై పర్యవేక్షణ లోపం లాంటి అంశాలపై అనుమానాలు తలెత్తుతున్నాయి. జిల్లాలోని అనేక హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, పానీ పూరిని విక్రయించే తోపుడు బండ్ల యజమానులు నాణ్యత లేని ఆహార దినుసులను వినియోగిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆహార వస్తువులకు మంచి రంగు వచ్చేందు కోసం విషపూరిత కలర్స్‌ను వినియోగించడం ఆందోళనకు కారణమవుతుంది. దీనికి తోడు నాణ్యతలేని మసాలాలు , ఆహార దినుసులను సైతం హోటళ్ల యజమానులు వినియోగిస్తూ జనాల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అధికారులు నిబంధన ప్రకారం తనిఖీలు చేపట్టకపోతుండడం కూడా హోటల్ యజమానులకు కలిసొస్తుందంటున్నారు. సంఘటన జరగగానే హడావిడి సృష్టించే అధికారులు ఆ తర్వాత కనిపించడం లేదంటున్నారు. హోటళ్ల, రెస్టారెంట్‌ల కల్తీ ఆహారం పై ఎవరికి ఫిర్యాదు చేయాలో అనే అంశంపై అవగాహన లేకపోవడం కూడా హోటల్ యజమానులకు కలిసొస్తుందంటున్నారు. సాధారణ ప్రజలకే కాకుండా ఉద్యోగులు, చదువుకున్న వారికి కూడా దీనిపై అవగాహన లేకపోవడం చర్చనీయంశమవుతోంది. నిర్మల్ జిల్లాలో కల్తీ ఆహారాన్ని తనిఖీ చేసే ఫుడ్ ఇన్స్‌పెక్టర్ ఆఫీస్ ఎక్కడుందో ఇప్పటికీ చాలా మందికి తెలియదంటే అతిశయోక్తి కాదంటున్నారు.



పట్టణంలోని రెస్టారెంట్‌లో నాణ్యత లేని చికెన్ బిర్యానీ తిని మృతి చెందిన యువతి



జిల్లా కేంద్రంలోని గ్రిల్ నైన్ రెస్టారెంట్ ఇదే

దిలావర్‌పూర్‌లో చిరుత అలజడి



దిలావర్‌పూర్ అడవిలో పులి అడుగుజాడలను వెతుకుతున్న అటవీశాఖ అధికారులు

దిలావర్‌పూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చిరుత సంచారం మండలంలో తీవ్ర అలజడి రేపింది. మొదట్లో సోమవారం రాత్రి మాడెగాం ఘాట్ రోడ్డుపై పెద్దపులి ఉందన్న వార్త మండలంలో దావానంలా వ్యాపించింది. ఓ ప్రైవేట్ బస్సు విద్యార్థులను మాడెగాం, కదిలి గ్రామాల్లో వదిలి తిరిగి వస్తుండగా.. మాడెగాం ఘాట్ రోడ్డుపై పులి బస్సుకు అడ్డుగా రాగా, భయపడ్డ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. అది మెల్లిగా రోడ్డు దాటి అడవుల్లోకి వెళ్లిపోయింది. వెంటనే డ్రైవర్ దిలావర్‌పూర్ బస్టాండ్‌కు చేరుకొని మాడెగాం వెళ్లేవారికి విషయం చెప్పి అప్రమత్తం చేశారు. ఈ వార్త అన్ని గ్రామాలకు నిమిషాల్లో చేరిపోయింది. దిలావర్‌పూర్ పోలీసులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం ఉదయం అటవీ శాఖ అధికారులు పెద్ద పులా, చిరుత పులా తేల్చేందుకు పాదముద్రల కోసం వెతుకులాట ప్రారంభించారు. దిలావర్‌పూర్ అడవినంతా గాలించారు. చివరకు అది పెద్దపులి కాదని, చిరుత పులి అని తేల్చేశారు. బస్సు డ్రైవర్ మాత్రం అది ముమ్మాటికీ పెద్దపులేనని చెబుతున్నాడు. అది పెద్ద పులా, చిరుత పులా అని కాకుండా ఏదో ఒక పులి మాత్రం సంచరిస్తుందన్నది నిజమని తేలింది. దీంతో గుట్టమీది గ్రామాల ప్రజలతో పాటు అడవికి సమీపంలో పంట పొలాలున్న రైతులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అసలే పత్తి తీసే సమయం కావడంతో రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

పెద్దపులి కాదు.. చిరుత పులి : దిలావర్‌పూర్ ఎఫ్‌బీవో

సోమవారం రాత్రి కనిపించింది. పెద్ద పులి కాదని చిరుత పులి అని ఎఫ్‌బీవో ఫారూఖ్‌ఖాన్ అన్నారు. తాము సేకరించిన పాదముద్రలను బట్టి అది చిరుత పులిగా నిర్ధారణకు వచ్చినట్లు చెప్పారు. రైతులు, సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

భయాందోళనలో గ్రామస్థులు.. అవగాహన కల్పించిన అధికారులు



కుంటాల, నవంబరు, 5 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలో గత ఐదు రోజులుగా పులి సంచరిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పులిసంచారంతో మండలంలోని మెదన్‌పూర్, సూర్యాపూర్, అంబుగాం గ్రామాలకు చెందిన రైతులు తమ పశువులను అటవీ ప్రాంతంలోకి మేతకు తీసుకెళ్లేందుకు భయపడుతున్నారు. అంతేగాకుండా వ్యవసాయ పనులకు సైతం ఒకరిద్దరు కాకుండా గుంపులు, గుంపులుగా వెళుతున్నారు. సోమవారం అంబుగాం పీరీల గుట్ట ప్రాంతంలో సుదర్శన్ పటేల్‌కు చెందిన ఆవును గాయపరిచిన పులి మంగళవారం అంబుగాం గ్రామానికి చెందిన హనుమంత్ మోరే గుట్ట వద్ద పశువుల మందపై గాండ్రింపు చేయగా పశువులు ఒక్కసారిగా గ్రామంలోకి పరుగెత్తుకు వచ్చాయి. అంబుగాం గ్రామానికి చెందిన వినోద్ రైతు యొక్క ఆవు జాడ దొరకకపోవడంతో పులి దాడి చేసి ఉంటుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉండి అటవీశాఖ అధికారులు అంబుగాం, మెదన్‌పూర్, సూర్యాపూర్ గ్రామాలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఆత్మన్యూనతాభావంతో మహేశ్వర్‌రెడ్డి ఆరోపణలు

- డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బీజేఎల్పీ నేత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలో ఆత్మన్యూనతాభావం చోటుచేసుకొని కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో కాంగ్రెస్ పార్టీలో, క్యాబినెట్‌లో సఖ్యత లేదని, సీఎం రేవంత్‌రెడ్డికి పట్టలేదని చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఉపముఖ్యమంత్రి, మంత్రివర్గ సహచరులు సమన్వయంతో ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్నారన్నారు. మహేశ్వర్ రెడ్డి ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేఎల్పీ నేతగా వ్యవహరిస్తున్న ఏలేటి ఏ ఒక్క ఎమ్మెల్యేతో సత్సంబంధాలు లేవని ఆయనలో న్యూనతాభావం ఆవరించిందన్నారు. మహేశ్వర్ రెడ్డి పెద్ద అబద్ధాల కోరు అని విమర్శించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుండి ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, ఆ పార్టీ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారన్నారు. పార్టీ అగ్రనాయకులు సైతం ఆయన అహంకార ధోరణిపై ఆగ్రహంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మహేశ్వర్‌రెడ్డి మాటలను ఎవరు నమ్మే పరిస్థితి లేదని ఇకనైనా అసత్యపు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.

మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటాం : డీసీసీ



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీహరిరావు

నిర్మల్‌లోని జ్యోతి బాపూలే పాఠశాలలో మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన పాఠశాల సందర్శించి విద్యార్థి మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. బాధ్యులను తక్షణం సస్పెండ్ చేయించారు. ప్రభుత్వం తరపున 2 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబానికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇళ్లకు హామీ ఇచ్చారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమాన్ అలీ, తదితర నాయకులు ఆయన వెంట ఉన్నారు.

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయండి

జిల్లాకేంద్రంలోని మహాత్మాజ్యోతి బాపూలే పాఠశాలలో దిలావర్‌పూర్ మండలం లోలంకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి అయాన్ మంగళవారం ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి న్యాయం చేయాలని ఫోన్ ద్వారా కలెక్టర్‌ను కోరారు. మృతికి గల కారణాలను తెలుసు కోవాలన్నారు. బాలుడి కుటుంబానికి సంతాపం తెలిపారు.

మొక్కలకు ప్రతీరోజు నీరు పట్టాలి : డీఎఫ్‌వో

నర్సాపూర్(జి), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మొక్కలకు ప్రతి రోజు నీరు పట్టాలని డీఎఫ్‌వో నాగిని భాను అన్నారు. నినర్సాపూర్(జి) మండల కేంద్రంలోని నర్సరీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొక్కలకు రెండు పూటల నీరు పట్టాలని, వాటిని సంరక్షించాలని సూచించారు. వీరి వెంట రేంజ్ ఆఫీసర్ రామకృష్ణ, వేణుగోపాల్, డీఆర్‌వో నజీర్ ఖాన్, బీట్ ఆఫీసర్ సాయి రెడ్డి, తదితరులు ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

నిర్మల్ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగ సంఘ భవనంలో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే మోకుదెబ్బ 4వ మహాసభలు జయప్రదం చేయాలని మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం నిర్వహించిన ముఖ్య నేతల సమావేశానికి నాయకులు గోపిగౌడ్, రాజేందర్‌గౌడ్, బాలాగౌడ్, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సాఫీగా సాగాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య
- జిల్లాలో 287 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు : కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు సంబంధించి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లు అభిలాష అభినవ్, రాజార్షిషా, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, శ్యామలదేవిలతో పాటు ఆయన అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ.. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు, సేకరించిన ధాన్యం, కొనుగోలు కేంద్రాల్లోని వసతులు, తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టెంటు, తేమ, తూకపు యంత్రాలు, టార్పాలిన్లు, సన్న ధాన్యం నిర్ధారణ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వరి ధాన్యానికి సంబంధించి మద్దతు ధర, ఇతర వివరాలు తెలిపేలా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే కేటాయించిన మిల్లులు, గోదాములలకు తరలించాలని సూచించారు. ప్రతి గోదాములో సీసీ టీవీలను ఏర్పాటు చేయాలన్నారు. రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు వివరాలను అధికారులకు అందజేయాలన్నారు. ప్రత్యేక అధికారులంతా క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని, కొనుగోలు జరుగుతున్న తీరును పరిశీలించి ఏవైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ధాన్యం అమ్మిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే విధంగా బ్యాంకర్లు గ్యారంటీ కల్పించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 287 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 1 లక్ష 35 వేల ఎకరాల్లో వరి ధాన్యం పండించినట్లు తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో సరిపడినన్ని తూకపు, తేమ యంత్రాలు, గన్నీబ్యాగ్స్, టార్పాలిన్లతో సహా 40 శాతం అధికంగా సన్న రకం ధాన్యం నిర్ధారణ పరికరాలు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఇప్పటికే బ్యాంకు, రెవెన్యూ అధికారులు, రైస్ మిల్లర్లతో పలుమార్లు సమావేశం నిర్వమించడంతో పాటు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిషోర్‌కుమార్, శ్యామలదేవి, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్, ఆదిలాబాద్ శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి, డీఎస్‌వో కిరణ్ కుమార్, డీఎం వేణుగోపాల్, రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య

కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి

ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణఆదిత్య అధికారులను ఆదేశించారు. మంగళవారం సోన్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి సందర్శించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఆయన పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. తాగునీరు, టెంటు, తూకపు, తేమ యంత్రాలు, గన్ని బ్యాగ్స్, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు చేసిన వెంటనే ధాన్యం కేటాయించిన మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, అన్ని రకాల రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్‌కుమార్, తహసీల్దార్ మల్లేష్, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం సివిల్ సప్లయిస్ వేణుగోపాల్, రైతులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

- మహాత్మాజ్యోతి బాపూలే పాఠశాలలో ఘటన
- బంధువుల ఆందోళన
- స్కూల్ ప్రిన్సిపాల్‌తో పాటు మరో ముగ్గురిపై సస్పెన్షన్ వేటు



అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన షేక్ అయాన్



స్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి బంధువులు

నిర్మల్ అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పదస్థితిలో ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే స్కూల్‌లో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నిర్మల్‌కు చెందిన అయాన్ హుస్సేన్(14) పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపూలే స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. రోజులాగే మంగళవారం కూడా పాఠశాలకు వెళ్లాడు. విరామ సమయంలో బేస్‌బాల్ ఆడుతూ.. ఒక్కసారిగా కళ్లు తిరిగి కింద పడి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో పాఠశాల సిబ్బంది వెంటనే అతన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అయాన్ మరణించినట్లు డాక్టర్లు ధ్రువీకరించారని టీచర్లు తెలిపారు. ఈ విషయమై వారు విద్యార్థి కుటుంబీకులకు సమాచారం అందించారు. దీంతో మృతుడి బంధువులు పెద్ద సంఖ్యలో స్కూల్‌కు తరలొచ్చి ఆందోళన చేశారు. టీచర్ల నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థి అయాన్ హుస్సేన్ మరణించాడని సిబ్బందిని నిలదీశారు. ఆ తర్వాత బాధ్యులైన సిబ్బందిపై కఠినచర్యలు తీసుకోవాలంటూ నిర్మల్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట గల ప్రధాన రోడ్డుపై బైఠాయించారు.

తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పలు విద్యార్థి సంఘాల నేతలు సైతం వీరి ఆందోళనకు మద్దతు పలికి రాస్తారోకోలో పాల్గొ న్నారు. దీంతో సమాచారం తెలుసుకున్న నిర్మల్ డీఈవో రవీందర్‌రెడ్డి, ఆర్డీవో రత్నకల్యాణిలు వెంటనే ఘటనా స్థలికి వచ్చి ఆందోళనకారులను సముదాయించారు. సంఘటనపై విచారణ జరిపి తగినచర్యలు తీసుకుంటామని, విద్యార్థి కుటుంబానికి న్యాయం చేస్తామంటూ వారు హామీ ఇవ్వడంతో.. వారు ఆందోళన విరమించారు. కాగా.. ఈ సంఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్‌తో పాటు కేర్ టేకర్ రమేష్, స్టాఫ్ నర్స్ సుజాత, పీఈటీలను సస్పెండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ మంగళవారం సాయంత్రం సస్పెన్షన్ ఉత్తర్వులను జారీ చేశారు.

సంక్షిప్త సమాచారం

అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఎస్కవేటర్ పట్టివేత



ఇసుకను తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన నెంబర్ ప్లేట్లు లేని ట్రాక్టర్లు

ఖానాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ శివారులోని రెంకోని వాగు నుండి మంగళవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, ఒక ఎక్స్కవేటర్‌ను పట్టుకున్నట్లు ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు తమకు అందిన రహస్య సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా ఎటువంటి నెంబర్లు లేని రెండు ట్రాక్టర్లలో ఎక్స్కవేటర్‌తో ఇసుక నింపుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో మూడు వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్ తరలించినట్లు ఎస్సై తెలిపారు.

దొంగతనం కేసులో ఒకరి రిమాండ్

మామడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కిరాణ షాపులో దొంగతనం కేసులో ఒకరిని రిమాండ్ చేసినట్లు సోన్ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం రోజున రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్న సందర్భంగా అనుమానాస్పదంగా తిరుగుతున్న గణేష్ అనే వ్యక్తిని విచారించగా జల్సాలకు అలవాటు పడి మద్యానికి బానిసై కొరిటికల్ గ్రామంలో కిరాణాషాపులో దొంగతనానికి పాల్పడినట్లు ఆయన ఒప్పుకున్నాడన్నారు. అతని వద్ద నుంచి రూ.45,060 స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వెంట మామడ ఎస్సై సందీప్, సిబ్బంది ఉన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ఖానాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తమ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో దారి తప్పిపోయి ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్న బాలుడిని తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన ఖానాపూర్ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన కథనం ప్రకారం... మండలంలోని పాత తర్లపాడ్ గ్రామానికి చెందిన పూసం శ్రీరామ్ అనే 10 సంవత్సరాల బాలుడు సోమవారం గంగాయిపేట్ గ్రామంలో తన మేనత్త ఇంటికి వెళ్లాడు. కాగా తిరిగి వచ్చే క్రమంలో దారి తప్పిపోయి ఖానాపూర్‌లోని సుభాష్‌నగర్, మదీనా కాలనీ ప్రాంతాల్లో ఏడుస్తూ తిరుగుతున్నాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా... వెంటనే బ్లూకోర్ట్ సిబ్బంది వెళ్లి బాలుడిని పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. పోలీస్‌స్టేషన్‌లో బాలుడి నుంచి పూర్తి సమాచారం తెలుసుకున్న అనంతరం అతని తల్లిదండ్రులకు అప్పగించారు. బ్లూకోర్ట్ సిబ్బంది సంతోష్‌నాయక్, రవీందర్, రైటర్ రవినాయక్, మణింద్రాలను సీఐ సైదారావు, ఎస్సై రాహుల్‌లు అభినందించారు.